
సాక్షి
జనగామ

I

గురువారం। 30। నవంబర్। 2023





సాక్షి
జనగామ
గురువారం । 30 । నవంబర్ । 2023





క్లుప్తంగా

దమ్మన్నపేటలో ఎలుగుబంట్ల సంచారం



వర్ధన్నపేట: మండలంలోని దమ్మన్నపేటలో బుధవారం తెల్లవారుజామున ఎలుగుబంట్లు సంచరించాయి. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఎలుగుబంట్లు జఫర్‌గఢ్ గుట్ట నుంచి దారి తప్పి గ్రామ సమీపానికి చేరుకున్నాయి. ఇక్కడ ఫామ్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన ఉచ్చులో ఓ పిల్ల చిక్కుకోగా రెండు దాని వద్దే వేచి ఉన్నాయి. అనంతరం గ్రామస్తులను చూసి ఆ రెండు పారిపోగా వారు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని ఉచ్చులో చిక్కుకున్న పిల్ల ఎలుగుబంటిని బంధించి హనుమకొండ జూ పార్క్‌కు తరలించారు. కాగా, పారిపోయిన ఎలుగుబంట్ల కోసం గాలింపు చేపట్టారు.

కేయూ దూరవిద్య కాంటాక్ట్ తరగతులు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి దూరవిద్య (ఎస్‌డీఎల్‌సీఈ) మ్యాథమెటిక్స్ ఫైనల్ ఇయర్ కాంటాక్ట్ తరగతులు డిసెంబర్ 2 నుంచి నిర్వహించనున్నట్లు దూర విద్యా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కరుణాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 2 నుంచి 11వ తేదీ వరకు రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాంటాక్ట్ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దూర విద్యా కేంద్రంలోని భవనంలోనే ఈ కాంటాక్ట్ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. విధిగా ఆయా విద్యార్థులు కాంటాక్ట్ తరగతులకు హాజరుకావాలని ఆయన కోరారు.

ఓట్లు రాబట్టుకోవడంపైనే అభ్యర్థుల తలమునకలు

- పక్కాగా పోల్ మేనేజ్‌మెంట్



హన్మకొండ: తెలంగాణ శాసన సభ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఓట్లు రాబట్టుకోవడంపై తలమునకలయ్యారు. గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవుతోంది. ఆ లోపు ఓటర్లను ఎలాగైనా ప్రసన్నం చేసుకోవాలనే ఎత్తుగడలతో ముందుకెళ్తున్నారు. ఈ క్రమంలో ప్రతి అభ్యర్థి పోల్ మేనేజ్‌మెంట్ పక్కాగా సాగేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతో పాటు ప్రత్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్ జరుగకుండా అడ్డంకులు సృష్టించే పనిలోనూ ఉన్నారు. ఈ క్రమంలో గ్రామాలు, నగరం, పట్టణాల్లో కాలనీలు, వీధుల్లో రాత్రి సమయంలోనూ అభ్యర్థులు అనుచరులు పోటీ పడి కాపలా కాస్తున్నారు. ఓ వైపు డబ్బులు పంచకుండా కాపలా కాస్తూనే మరో వైపు ఓటర్లకు డబ్బులు అందిస్తున్నారు. కాగా, మూడు ప్రధాన పార్టీలు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ ఈ ఎన్నికలను ప్రతిష్టాకంగా తీసుకున్నాయి. దీంతో రాష్ట్రంలో త్రిముఖ పోటీ నెలకొంది. మూడు పార్టీల మధ్య తీవ్ర పోటీ ఉంటుండగా ప్రతి అభ్యర్థి గెలుపును సవాల్‌గా తీసుకుంటున్నారు. ఫలితంగా విజయం కోసం ఎప్పటికప్పుడు వ్యూహాలు రచిస్తున్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకూ ఓటర్లను తమకు అనుకూలంగా మలచుకునే ఆలోచనతో ముందుకెళ్తున్నారు.



నా జీవితం ప్రజాసేవకే అంకితం

- అంకితభావం.. ప్రజానాయకుడిగా పేరు వచ్చింది
- ప్రభుత్వ పదవులతోపాటు ట్రస్ట్ ద్వారా ప్రజలకు సేవలందించా
- సేవా కార్యక్రమాల్లో భార్య ఉషాదేవి సహకారం మరువలేనిది
- 'సాక్షి' ఇంటర్వ్యూలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పాలకుర్తి: 'నాకు మొదటి నుంచి ప్రజలకు సేవచేయాలనే తపన ఉండేది. ఆ దృక్పథంతో ఎన్‌టీ.రామారావు స్థాపించిన తెలుగు దేశం పార్టీలో చేరాను. నా అంకితభావాన్ని గమనించి ఎన్‌టీఆర్ పార్టీ పదవులు అప్పగించారు. ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచి ప్రజలకు అవసరమైన పనులన్నీ చేశాను. ప్రభుత్వం నుంచి వచ్చిన పదవితో పాటు ప్రజలకు మరిన్ని సేవలు అందుబాటులోకి తేవాలని చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి వారికి నిరంతరం అందుబాటులో ఉన్నా' అని బీఆర్‌ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సేవా కార్యక్రమాల్లో తన భార్య ఉషాదేవి సహకారం మరువలేనిదన్నారు. 'ప్రజలు నన్ను అక్కున చేర్చుకుని ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి ఎంపీగా గెలిపించారు. సుదీర్ఘ నా రాజకీయ జీవితంలో ప్రజలకు అందించిన ఉత్తమ సేవలకు గుర్తింపుగా ప్రజానాయకుడిగా పేరు వచ్చింది. నా జీవితం ప్రజాసేవకే అంకితం' అని చెప్పారు. బుధవారం మంత్రి 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

పాలకుర్తి నియోజకవర్గంలో ప్రజా సమస్యలు పరిష్కరించాను. పేదలందరికీ అండగా నిలిచి నియోజకవర్గ అభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషించాను. రహదారుల పునర్నిర్మాణం, రోడ్ల వెడల్పు, డివైడర్ల ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్‌తోపాటు గ్రామాల్లోని ప్రతి వీధిలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాం.

ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం

ఆధ్యాత్మికతకు సంబంధించి పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేశాను. వల్మిడిలో మరో భద్రాద్రిని తలపించేలా సీతారామ చంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణానికి కృషి చేశాను. అలాగే పాల్కురికి సోమనాథుడి విగ్రహం, సోమనాథుడి స్మృతి వనం, బమ్మెర పోతన స్మారక మందిరం ఏర్పాటు చేయించాను.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

మహిళల జీవనోపాధికి కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ పూర్తి చేసుకున్న వారికి మిషన్లను ఉచితంగా అందించాను. అలాగే అర్హులందరికీ ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించాను. కోతులను పట్టించి అడవిలో వదిలి గ్రామస్తులు, వ్యవసాయదారులకు వాటి బెడద లేకుండా చేశాను. కోతులకు అడవిలో ఆహారం ఏర్పాటుకు చర్యలు చేపట్టాను.

పోటీ పరీక్షల శిక్షణ కేంద్రాల ఏర్పాటు

విద్యార్థులకు సంబంధించి నియోజకవర్గంలోని ప్రతి మండలానికి పోటీ పరీక్షల శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయించాను. ఉత్తమ శిక్షణ అందించడానికి అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన చేయించాను. శిక్షణ పొందే విద్యార్థులకు మెటీరియల్‌తోపాటు భోజన సదుపాయం కల్పించాను. అలాగే పాలకుర్తిలో విద్య అవసరాల నిమిత్తం డిగ్రీ కళాశాల మంజూరు చేయించా. విద్యావసరాలకు ఇంకా చేయాల్సినవి ఉన్నాయి. 30 పడకల ఆస్పత్రిని 50 పడకలకు అప్‌గ్రేడ్‌కు కృషి చేశాను. పాలకుర్తి, చెన్నూరు గ్రామాల్లో ఉన్న రిజర్వాయర్ల నిర్మాణం పూర్తి కావస్తున్నది.

సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం

తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత సీఎం కేసీఆర్ అమలులోకి తీసుకువచ్చిన అనేక ప్రజా సంక్షేమ పథకాలు దేశ వ్యాప్తంగా ఆదర్శంగా నిలిచాయి. సీఎం కేసీఆర్ ఇచ్చిన స్ఫూర్తితో నియోజకవర్గానికి అవసరమైన నిధులు మంజూరు చేయించుకుని అభివృద్ధికి కృషి చేశాను. ప్రజలకు అవసరమైన పనులు చేపట్టి వారికి అందుబాటులో ఉంటున్నాను. నియోజకవర్గంలో చేయాల్సిన అభివృద్ధి ఇంకా ఉంది. అందుకు మరోసారి అవకాశం ఇచ్చి అధిక మెజార్టీతో గెలిపించాలి.

ప్రజలే నా బలం.. బలగం

- మీ ఆడబిడ్డను.. అవకాశం ఇవ్వండి
- స్థానికంగా ఉంటా.. సమస్యలు పరిష్కరిస్తా
- యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కృషి..
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కాంగ్రెస్ పాలకుర్తి అభ్యర్థి యశస్వినిరెడ్డి



తొర్రూరు: 'ప్రజలే నా బలం బలగం.. వారికి సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చాను.. మీ ఆడబిడ్డను.. ఒక అవకాశం ఇవ్వండి' అని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. బుధవారం ఆమె 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు యశస్వినిరెడ్డి మాటల్లోనే..

ప్రజాసేవ చేసేందుకే వచ్చా..

మాది పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామం. అత్తామామలు రాజేందర్‌రెడ్డి, ఝాన్సీరెడ్డి, భర్త రాజారామ్మోహన్‌రెడ్డి ఈ ప్రాంతానికి ఎంతో సేవ చేశారు. వారి స్ఫూర్తితోనే ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా. ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే పాలకుర్తి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా.

పాలకుర్తి మీదే ఆలోచన

అత్తా, మామలు విదేశాల్లో ఉన్నప్పటికీ వారి ఆలోచనలు పాలకుర్తి మీదే ఉంటాయి. వారు స్థానికంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు.. ఇప్పటికీ చేస్తున్నారు. వారి సేవా స్ఫూర్తిని కొనసాగించేందుకు రాజకీయాల్లోకి వచ్చాను. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తొర్రూరు మండలం గుర్తూరులో 70 ఎకరాల స్థలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. గతంలో తొర్రూరులో 30 పడకల ఆస్పత్రిని సొంత నిధులతో నిర్మించాం. చెర్లపాలెం, కాచికల్, ములుగు గ్రామాల్లో, నల్గొండ జిల్లా సోలిపేటలో పాఠశాలలు నిర్మించాం. గోపాలగిరిలో కమ్యూనిటీ హాల్ నిర్మించడంతో పాటు ఖమ్మం జిల్లా మధిరలో లైబ్రరీ నిర్మించాం. రోగుల సౌకర్యార్థం మూడు దశాబ్దాల క్రితమే రూ.కోట్లు వెచ్చించి వైద్య పరికరాలు అందించాం.

ప్రజలు మార్పు కోరుతున్నారు..

పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. యువత రాజకీయాల్లోకి రావడాన్ని స్వాగతిస్తున్నారు. 15 ఏళ్లుగా ఒకే వ్యక్తి ఆధ్వర్యాన ఇక్కడ నియంత పాలన సాగుతోంది. శాసించే ధోరణి ప్రజాస్వామ్యంలో ప్రమాదకరం. ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయి ప్రజలకు చెందాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం సామాన్యుడికి అందాలన్నదే నా అభిమతం.

ఆడబిడ్డకు అవకాశమివ్వండి..

మహిళలకు ఈ నియోజకవర్గంలో ఒకే అవకాశం దక్కింది. దశాబ్దాలుగా మహిళలకు, యువతకు ఎమ్మెల్యేగా సేవ చేసే అవకాశం దక్కలేదు. ఈసారి నాలాంటి ఆడబిడ్డకు కాంగ్రెస్ అవకాశమిచ్చింది. పాలకుర్తి ప్రజలు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయను. ప్రజల అభివృద్ధి, సంక్షేమమే నా ధ్యేయం. అందరికీ అందుబాటులో ఉంటూ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

ఓటర్లకు డబ్బులు పంచిన బీఆర్‌ఎస్ నాయకులు

- రూ.43వేలు స్వాధీనం

మహబూబాబాద్ రూరల్ : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో 19వ వార్డులోని మార్వాడీ సత్రం ప్రాంతంలో బుధవారం ఓటర్లకు బీఆర్‌ఎస్ నాయకులు డబ్బులు పంచుతుండగా రూ.43వేలు పట్టుకున్నామని టౌన్ సీఐ వై.సతీష్ తెలిపారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్ నాయక్ తరఫున బీఆర్‌ఎస్ నాయకులు మార్వాడీ సత్రం వద్దకు ఓటర్లను పిలిపించి వారి వద్ద ఉన్న పోల్ చీటీలను తీసుకుని డబ్బులు ఇస్తున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం లీడర్ ఆర్.సుగుణాకర్‌కు సమాచారం అందిందని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకుని నగదును స్వాధీనం చేసుకుని డబ్బులు పంచుతున్న నల్లపు వీరన్నను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. పోలీసు స్టేషన్‌కు తరలించాక కేసు నమోదు చేసి సదరు డబ్బును ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సంబంధిత ఉన్నత అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.



ఘటనా స్థలిలో నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

రూ.33 వేల నగదు పట్టివేత

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని లక్ష్మతండా గ్రామ పంచాయతీ పరిధిలోని బూరుకుంట తండాలో బీఆర్‌ఎస్ తరఫున ఓటర్లకు పంచుతున్న రూ.33,500 నగదును స్వాధీనం చేసుకున్నామని ఫ్లయింగ్ స్క్వాడ్ టీం లీడర్ సామ్రాజ్ బుధవారం రాత్రి తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకుడు భూక్య రామారావు ఓటర్లకు డబ్బులు పంచుతుండగా తమకు సమాచారం అందడంతో ఘటనా స్థలికి చేరుకొని అదుపులోకి తీసుకుని, డబ్బులు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు కోసం పోలీసులకు సమాచారం ఇచ్చామని తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్ : క్షణికావేశంలో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ మండలం రోటిబండ తండా జీపీ పరిధి దూదియా తండాలో జరిగింది. రూరల్ ఎస్సై బి.రాంచరణ్ కథనం ప్రకారం.. తండాకు చెందిన తేజావత్ శ్రీను (30)కు భార్య సంధ్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీను రెండు రోజుల క్రితం జరిగిన ఓ రాజకీయ పార్టీ సమావేశానికి వెళ్లి ఇంటికి వచ్చాడు. ఆ రాకపోకలకు సంబంధించిన డబ్బును అడిగేందుకుగాను సంబంధిత బాధ్యుల వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో మాటమాట పెరిగి శ్రీను స్థానికులైన రాము, మౌనికతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో మౌనికపై చేయి చేసుకున్నాడు. ఆ విషయమై మంగళవారం ఎక్కడ పెద్దమనుషుల వద్దకు పిలిపిస్తారోననే భయాందోళనకు గురై క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు, కుటుంబీకులు వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి..

మహబూబాబాద్ రూరల్ : అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ కౌలు రైతు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి బేతోలు గ్రామ శివారు చంద్రనగర్ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీ చెందిన గుగులోతు సురేశ్ (36).. భూక్య రమేష్ వద్ద 5 ఎకరాలు, బోడ కమల వద్ద 3 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. వరి, పత్తి, మిర్చి పంటల సాగుకు మొత్తం సుమారు రూ. 6 లక్షల పైచిలుకు అప్పు అయింది. పంటలు దిగుబడి రాకపోవడంతో ఆర్థికంగా నష్టం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన సురేశ్ ఈనెల 26వ తేదీన గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తల్లి శాంతి వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య సునీత, కుమారుడు, కుమార్తె ఉంది. ఈ ఘటనపై మృతుడి తండ్రి బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్నామని కురవి ఎస్సై బైరు గోపి తెలిపారు.



సురేశ్(ఫైల్)

చెరువులో పడి ఒకరు..

మహాముత్తారం : చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందాడు. ఈ ఘటన మహాముత్తారంలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన అజ్మీరా రవీందర్(45) బుధవారం పోలీస్‌స్టేషన్ సమీపంలోని చెరువులో చేపల వేటకు వెళ్లాడు. అక్కడ నీటిలో మునిగి మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు జైపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఈవీఎంల పంపిణీ కేంద్రంలో ఉద్యోగికి ఫిట్స్

- ఆస్పత్రికి తరలింపు



మహేందర్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న సహచరులు

స్టేషన్‌ఘన్‌పూర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఎన్నికల విధులు కేటాయించబడిన పీఓలు, ఏపీఓలకు ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి పంపిణీ చేసేందుకు డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రంలో డి.హేమంత్‌కుమార్ అనే ఉద్యోగికి ఒక్కసారిగా ఫిట్స్ వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదిలాబాద్‌కు చెందిన హేమంత్‌కుమార్ జనగామలో విద్యాశాఖలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా హేమంత్‌కు ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏపీఓగా నియమించారు. ఈవీఎంల పంపిణీ కేంద్రానికి హాజరైన హేమంత్ కుమార్ మధ్యాహ్నం ఫిట్స్‌కు గురయ్యాడు. వెంటనే గమనించిన తోటి అధికారులు 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. 108 సిబ్బంది హరికృష్ణ, రాజన్న సకాలంలో స్పందించి అతడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

తరలిన ఈవీఎంలు, వీవీ ప్యాట్లు



ఏనుమాములలో పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న ఎన్నికల సిబ్బంది

వరంగల్: వరంగల్ ఏనుమాములలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వరంగల్ పశ్చిమ, తూర్పు, పరకాల, వర్ధన్నపేట నియోజకవర్గాల ఈవీఎంల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారులు, ఆర్‌ఓలు పరిశీలించారు. ఈసందర్భంగా హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్ మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లాలో పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్, తూర్పు ఆర్‌ఓ రిజ్వాన్‌బాషా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఈవీఎంలు ఇతర పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలించారు. పోలింగ్ విధులకు హాజరైన అధికారులు, సిబ్బంది హాజరు వివరాల్ని జనరల్ అబ్జర్వర్లు డాక్టర్ హెచ్.ఎస్.గోపాలకృష్ణ, షణ్ముఘ రాజన్, పోలీస్ అబ్జర్వర్ తోగో ఖర్గా.. కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ అధికారులు సిబ్బందితో మాట్లాడి ఈవీఎంల డెమోను పరిశీలించారు. ఏనుమాములలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య సేవలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులు సిబ్బందికి సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారీ పలు సూచనలు చేశారు. జిల్లా జనరల్ అబ్జర్వర్లు, కలెక్టర్ జెండా ఊపి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు ఎన్నికల సామగ్రితో వెళ్తున్న వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, రిటర్నింగ్ అధికారులు రిజ్వాన్‌బాషా, రమేశ్, శ్రీనివాస్, వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్ తదితరులున్నారు.

భూపాలపల్లి నుంచి ఎన్నికల సామగ్రితో వెళ్తున్న సిబ్బంది



జనగామ: ఎన్నికల సామగ్రితో వెళ్తున్న అధికారులు



నేడే పోలింగ్..

- తెలంగాణ శాసనసభ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 7 గంటలకు ప్రారంభం
- సాయంత్రం 5 గంటలకు ముగింపు
- ఈవీఎంలలో నిక్షిప్తం కానున్న అభ్యర్థుల భవితవ్యం

తెలంగాణ శాసన సభ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఓటర్లు తమ తీర్పును ఈవీఎంలో భద్రపరుచనున్నారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. ఈ క్రమంలో బుధవారం ఎన్నికల సిబ్బందికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) వీవీప్యాట్స్‌ను పంపిణీ చేశారు. అనంతరం సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాలకు వాహనాల్లో సామగ్రిని తీసుకుని తరలారు. కాగా, పలు చోట్ల పోలింగ్ కేంద్రాలను సర్వాంగ సుందరంగా అలకంరించారు. -సాక్షి నెట్‌వర్క్



చిట్యాల : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల అధికారులు



కేసముద్రం స్టేషన్‌లోని మోడల్ పోలింగ్ కేంద్రంలో తోరణాలు కడుతున్న అధికారులు





ఏనుమాముల మార్కెట్ నుంచి ఎన్నికల సామగ్రితో వెళ్తున్న అధికారులు





మహబూబాబాద్: ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది



మునుగోడులో పోలింగ్ కేంద్రం వద్ద ముగ్గులు వేస్తున్న సిబ్బంది

ఓటు బాటా!

- ఇళ్లకు చేరుతున్న వలస ఓటర్లు
- వివిధ రూట్లలో కిక్కిరిసిన బస్సులు

వలస ఓటర్లతో కిటకిటలాడుతున్న హనుమకొండ బస్ స్టేషన్



హన్మకొండ : వలస ఓటర్లు ఓటేద్దామని ఇంటి బాట పట్టారు. దీంతో బుధవారం ఆయా రూట్లలో బస్సులు కిక్కిరిసి నడిచాయి. ఈసారి పోటీ తీవ్రతరం కావడంతో వలస ఓటర్లకు దారి ఖర్చులు, ఇతరత్రా తాయిలాలిస్తూ.. గ్రామాలకు రప్పించుకుంటున్నారు. గురువారం పోలింగ్ జరుగనుండడంతో బుధవారం వలస ఓటర్లు స్వగ్రామాలకు చేరుకున్నారు. ప్రయాణ ప్రాంగణాలు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా హైదరాబాద్ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వలస ఓటర్లు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. దీంతో వారికి ఇబ్బందులు ఎదురవకాకుండా టీఎస్ ఆర్టీసీ అదనపు బస్సుల్ని నడుపుతోంది. హైదరాబాద్–హనుమకొండ రూట్‌లో రోజకు 240 షెడ్యూల్స్ నడుస్తుండగా.. బుధవారం 100 షెడ్యూళ్లు అదనంగా నడిపారు. ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత, డిప్యూటీ ఆర్‌ఎంలు భానుకిరణ్, మాధవరావు, డిపో మేనేజర్లు హనుమకొండ బస్‌స్టేషన్, హైదరాబాద్ ఎంజీబీఎస్, ఉప్పల్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ.. అప్పటికప్పుడు అదనపు బస్సులు సమకూర్చి గమ్యస్థానాలకు చేరుస్తున్నారు. హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి ప్రయాణికుల రద్దీ మేరకు అవసరమైన రూట్లలో అదనపు బస్సులు నడిపారు.

సాక్షి
జనగామ

గురువారం । 30 । నవంబర్ । 2023

సోమేశ్వరాలయంలో ఆరుద్రోత్సవం

కార్తీక మహోత్సవంలో భాగంగా బుధవారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో ఆరుద్రోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి 216 లీటర్ల ఆవు పాలతో ఏకాదశ రుద్రాభిషేకం చేశారు.

- పాలకుర్తి టౌన్



V

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0⁰ /23.0⁰

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కొంత మేర తగ్గుతాయి. రాత్రి పూట చలి తీవ్రత మరింత పెరుగుతుంది.

ఓటేద్దాం..రండి!

నేడే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్

- ఉమ్మడి జిల్లాలో 28,92,786మంది ఓటర్లు.. 3,294 పోలింగ్ కేంద్రాలు
- 12 నియోజకవర్గాల్లో 213 మంది అభ్యర్థులు...
- బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నుంచి 36 మంది బరిలో..
- పోలింగ్ నిర్వహణకు యంత్రాంగం సన్నద్ధం
- కేంద్రాలకు చేరిన ఈవీఎంలు, ఎన్నికల నిర్వహణ అధికారులు





జనగామ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రితో సిబ్బంది..(ఇన్‌సెట్‌లో) కేటాయించిన ప్రాంతాలకు వెళ్తూ..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించే అసెంబ్లీ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనల మేరకు అధికార యంత్రాంగం పూర్తి చేసింది. మొత్తం 12 నియోజకవర్గాల్లో 28,92,786 మంది ఓటర్లు ఉండగా.. 3,294 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. 213 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో సౌకర్యాలు కల్పించారు. ఇప్పటికే ఈవీఎంలు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు.

- VIలో▸

- సాక్షి ప్రతినిధి, వరంగల్

అన్నం, నీళ్లు లేవు

- అధికారుల నిర్లక్ష్యం
- ఆందోళనకు దిగిన పీఓ, ఏపీఓ, ఓపీఓలు
- ఆర్వోపై కలెక్టర్ ఆగ్రహం

VIలో

జనగామ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో అధికారుల నిర్లక్ష్యం వల్ల సిబ్బందికి ఇబ్బందులు తప్పలేదు. భోజనం కోసం పీఓ, ఏపీఓ, ఓపీ ఓలు ఆందోళనకు దిగారు.

- జనగామ



భోజనం కోసం ఎగబడుతున్న ఎన్నికల సిబ్బంది

ఓటు ఇలా వేద్దాం

ఓటు వేయడానికి ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తీసుకెళ్లాలి. ఎన్నికల నిబంధనల మేరకు అనుమతి ఉన్నవారే పోలింగ్ సెంటర్‌లోకి వెళ్లాలి.

- వివరాలు VIలో▸



డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో కలెక్టర్ శివలింగయ్య..

కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షణ

- అధికారులకు సూచనలు చేసిన కలెక్టర్ శివలింగయ్య
- సామగ్రి పంపిణీ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి

VIలో

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సీహెచ్.శివలింగయ్య పర్యవేక్షణలో ఎన్నికల నిర్వహణ సామగ్రి తరలించే ప్రక్రియ బుధవారం పూర్తయింది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గ కేంద్రాల పంపిణీ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

- జనగామ

క్లుప్తంగా

రూ.18వేలు సీజ్

● ఇద్దరిపై కేసు నమోదు

లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాల ఘణపురం మండల కేంద్రంలో బుధవారం ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తుండగా ఎఫ్ఎస్టీ–1 బృందం ఇన్చార్జ్ బానోతు రాజు రూ.18వేల నగదును పట్టుకొని సీజ్ చేశారు. మండల కేంద్రానికి చెందిన వంగ ఉప్పలయ్య వద్ద రూ.15,000, బెజ్జం అంజనేయులు వద్ద రూ.3,000 లభించగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

ఎన్నికలకు భారీ బందోబస్తు

● ప్రజలు పోలీసులకు సహకరించాలి

● డీసీపీ సీతారాం



పాలకుర్తి టౌన్: ప్రజలు పోలీసులకు సహకరించాలి.. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఉండాలని జనగామ డీసీపీ సీతారాం అన్నారు. పాలకుర్తి నియోజవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల బందోబస్తుకు 900 మంది పోలీసులతో పాటు సాయుధ బలగాలతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బందోబస్తులో పోలీస్, ఎక్సైజ్, రైల్వే, సాయుధ బలగాలు విధులు నిర్వహిస్తున్నాయన్నారు. నియోజవర్గంలో 61 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పాలకుర్తి సీఐ విశ్వేశ్వర్, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు ఇలా వేద్దాం..



ఓటు వజ్రాయుధం. సరైన వ్యక్తిని ఎన్నుకునేందుకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు. దాన్ని సద్వినియోగం చేసుకుంటే ఐదేళ్లు మనల్ని ఆ వ్యక్తి సరిగ్గా పాలిస్తాడు. ఆశలు, ప్రలోభాలకు గురై దుర్వినియోగం చేసుకుంటే మన హక్కును మనమే కాలరాసుకున్నట్లు. నేడు (గురువారం) పోలింగ్. ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి? పోలింగ్‌కేంద్రంలోకి వెళ్లాక ఏం చేయాలి? అక్కడ అధికారులెవరు ఉంటారు? ఈవీఎంపై ఎలా ఓటు వేయాలి? అనే అంశాలను ఒక్కసారి చూద్దాం.

- వరంగల్ డెస్క్

12 కార్డుల్లో ఏదో ఒకటి..



పోల్ చిట్టీల పంపిణీ జరగకపోయినా నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయొచ్చు. బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారు. అక్కడ బీఎల్ఓలను కలిసి పోల్ చిట్టీలు తీసుకుని ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఓటరుకార్డు లేకపోతే.. పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఫొటోతో ఉన్న సర్వీస్ గుర్తింపు కార్డు, బ్యాంకు, పోస్టాఫీస్ పాస్‌బుక్, పాన్‌కార్డు, ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్‌కార్డు, ఫొటోతో కూడిన పెన్షన్ కార్డు, ఆధార్‌కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, ఎన్ఆర్ఐలు అయితే పాస్‌పోర్టు చూపించాల్సి ఉంటుంది.

పోలింగ్ కేంద్రంలోకి వీరికి మాత్రమే అనుమతి..

- ప్రిసైడింగ్ అధికారి ఒకసారి ఎంతమంది ఓటర్లను లోనికి అనుమతిస్తే.. వారు మాత్రమే రావాల్సి ఉంటుంది.
- పోలింగ్ అధికారులు, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది
- ఎన్నికల సంఘం అనుమతించిన వ్యక్తులు.
- అభ్యర్థులు, వారి ఏజెంట్లు, పోలింగ్ ఏజెంట్లు.
- ఓటు వేయడానికి వచ్చినవారు, చంకన ఎత్తుకున్న పిల్లలు.
- అంధులు, వృద్ధులకు తోడుగా వచ్చినవారు.
- రిటర్నింగ్ అధికారి, ప్రిసైడింగ్ అధికారి, ప్రత్యేక పరిస్థితుల్లో నియమించిన వ్యక్తులు మాత్రమే పోలింగ్ రోజు కేంద్రంలోకి వెళ్లే అవకాశం ఉంటుంది.
- ఈనిబంధనలు అతిక్రమించిన వారిపై అధికారులు చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.






ఇవి వద్దు..

పోలింగ్ కేంద్రంలోకి ఓటర్లు సెల్‌ఫోన్లు, కెమెరాలు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లకూడదు. సెల్ఫీలు తీసుకోవడం కూడా నేరం.



ఇలా చేయొద్దు..

మీరు ఈవీఎంలో ఒక బటన్ నొక్కిన తర్వాత మరో బటన్ నొక్కొద్దు. దీని వల్ల మీ ఓటు నమోదు కాదు. వృథా అవుతుంది. అందుకని ఒకసారి మాత్రమే బటన్ నొక్కి ఓటు హక్కును వినియోగించుకోవాలి.





బ్యాలెట్‌లో నోటా అనే ఆప్షన్ కూడా ఉంటుంది. మీకు పోటీలో నిలిచిన ఏ పార్టీ అభ్యర్థి నచ్చకపోయినా నోటా ఎదురుగా ఉన్న బటన్ నొక్కి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

1 ఓటు హక్కు ఉన్న వారు మీకు కేటాయించిన పోలింగ్‌స్టేషన్‌కు వెళ్లేటప్పుడు కచ్చితంగా ఓటరు స్లిప్‌తోపాటు గుర్తింపుకార్డు వెంట తీసుకెళ్లాలి. ఒకవేళ గుర్తింపు కార్డు లేకపోతే ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి వెంట తీసుకెళ్లాలి. కేంద్రంలోని పోలింగ్ బూత్ వద్ద క్రమశిక్షణగా క్యూలో నిలబడి ఉండాలి.

2 బూత్‌లోపలికి వెళ్లాక మొదట మొదటి పోలింగ్ అధికారి వద్ద మీ పేరు, క్రమసంఖ్యను తెలపాలి. ఆయన తన వద్ద ఉన్న ఓటరు లిస్టులో ఓటర్ ఐడీ, పేరు, సీరియల్ నంబర్ చెక్‌చేసి నిర్ధారిస్తారు. మీ వివరాలను అందరికీ తెలిసేలా చెబుతారు. పక్కనే ఉన్న వివిధ పార్టీల అభ్యర్థుల తరపున ఉండే పోలింగ్ ఏజెంట్లు ఆ వివరాలను తన వద్ద ఉన్న ఓటరు లిస్టులో చెక్ చేసుకుంటారు. ఇక్కడ ఏదైనా తేడా వస్తే ఏజెంట్లు అభ్యంతరం తెలిపే అవకాశం కూడా లేకపోలేదు.

3 ఆ తర్వాత రెండో పోలింగ్ అధికారి వద్దకు వెళ్లాలి. అతను మీ ఎడమ చేతి చూపుడు వేలి గోటిపై సిరా చుక్క అద్దుతారు. మూడో పోలింగ్ అధికారి వద్దకు వెళ్లాలి. అక్కడ ఆయన ఓటర్ స్లిప్ తీసుకుని అప్పటికే ఓటింగ్‌కు సిద్ధం చేసిన ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌ను కేటాయిస్తారు. రహస్యంగా ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లలో ఈవీఎం ఉంటుంది.

4 మీకు కేటాయించిన ఈవీఎం యూనిట్ దగ్గరికి వెళ్లాలి. అక్కడున్న ఈవీఎం బ్యాలెట్‌లో పోటీలో ఉన్న అందరి అభ్యర్థుల ఫొటోలు, గుర్తులు వరుస క్రమంలో ఉంటాయి. వాటిని గమనించి నచ్చిన పార్టీ ఎదురుగా గల బటన్‌ను గట్టిగా నొక్కాలి. రెడ్ లైట్ రావడంతోపాటు బీప్ సౌండ్ వస్తుంది. అప్పుడు మీ ఓటు వినియోగించుకున్నట్లు అర్థం. అదే సమయంలో పక్కన ఉన్న వీవీ ప్యాట్‌లో మీరు ఏ గుర్తుకు ఓటు వేశారో ఆ గుర్తు కనిపిస్తుంది. దాన్ని కూడా గమనించి మీరు వేసిన ఓటు సరిగ్గా నమోదైందా.. లేదా అనేది నిర్ధారించుకోవచ్చు.

5 అక్కడి నుంచి మీకు కేటాయించిన ఎగ్జిట్ దారి గుండా బయటికి వెళ్లాలి. ఎవరికి ఓటు వేశారో మీ అంతరాత్మకు మాత్రమే తెలియాలి. బయటికి చెప్పొద్దు.

ఓటేద్దాం.. రండి!



పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సామగ్రితో బస్సులో వెళ్లడానికి సిద్ధంగా ఉన్న అధికారులు



ఓటింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
వరంగల్ పశ్చిమ	1,37,139	1,39,976	10	2,77,125
పరకాల	1,06,451	1,10,601	02	2,17,054
వరంగల్ తూర్పు	1,20,323	1,25,621	338	2,46,282
నర్సంపేట	1,11,870	1,14,742	05	2,26,617
వర్ధన్నపేట	1,28,722	1,31,818	15	2,60,555
జనగామ	1,14,626	1,14,973	10	2,29,609
పాలకుర్తి	1,22,040	1,21,682	08	2,43,730
స్టేషన్‌ఘన్‌పూర్	1,20,848	1,22,132	01	2,42,981
మహబూబాబాద్	1,21,441	1,24,289	35	2,45,765
డోర్నకల్	1,05,886	1,08,242	26	2,14,154
భూపాలపల్లి	1,33,461	1,34,562	05	2,68,028
ములుగు	1,08,588	1,12,277	21	2,20,886
	13,31,395	14,60,915	476	28,92,786

మొత్తం ఓటర్లు: **28,92,786**

పురుష ఓటర్లు: **13,31,395**

మహిళా ఓటర్లు: **14,60,915**

ఇతర ఓటర్లు: **476**

పోలింగ్ స్టేషన్లు: **3,294**

సమస్యాత్మకం: **960**

పోటీలో ఉన్న అభ్యర్థులు: **213**

నియోజకవర్గం	మొ.బూత్‌లు	సమస్యాత్మకం
వరంగల్ పశ్చిమ	244	58
వరంగల్ తూర్పు	230	51
స్టేషన్‌ఘన్‌పూర్	290	64
పాలకుర్తి	294	63
వర్ధన్నపేట	278	70
పరకాల	239	58
భూపాలపల్లి	317	112
డోర్నకల్	256	37
ములుగు	303	261
మహబూబాబాద్	283	37
జనగామ	277	87
నర్సంపేట	283	62
	3,294	960

పోలింగ్ తేదీ: 30.11.2023

పోలింగ్ సమయం: ఉదయం 7నుంచి సాయంత్రం 5 గంటల వరకు

(ఏజెన్సీ ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకే..)

నేడే అసెంబ్లీ పోలింగ్

● ఉమ్మడి జిల్లాలో 28,92,786మంది ఓటర్లు.. 3,294 పోలింగ్ కేంద్రాలు

సాక్షి ప్రతినిధి, వరంగల్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ముగియగా.. గురువారం పోలింగ్ జరగనుంది. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, ప్రచారం సాఫీగా సాగింది. ఈ క్రమంలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సౌకర్యాలు కల్పించారు. 3,294 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరగనుండగా.. 6,332 ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)ను సిద్ధం చేసినట్లు అధికారులు ప్రకటించారు. కాగా 12నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నుంచి 36మంది బరిలో నిలవగా.. బీఎస్పీ, ఏఐఎఫ్‌బీ తదితర పార్టీలతోపాటు స్వతంత్రులు కలిపి 213మంది పోటీలో నిలిచారు. మొత్తం 28,92,786 మంది ఓటర్లలో 12,098మంది పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకున్నారు. అలాగే 4,036 మంది దివ్యాంగులు, వయోవృద్ధులు ఇంటి వద్ద నుంచే ఓటేసేందుకు దరఖాస్తు చేసుకుని 3,912మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

2018.. 2023ఎన్నికల షెడ్యూల్‌లు ఇలా..

2018 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే.. 2023ఎన్నికల షెడ్యూల్ తేదీలు కొద్దిగా అటుఇటుగా ఉన్నాయి. 2018లో ఎన్నికల షెడ్యూల్ అక్టోబర్ 6న విడుదల చేస్తే, ఈసారి మూడు రోజుల ఆలస్యంగా అక్టోబర్ 9న ప్రకటించారు. 2018లో నోటిఫికేషన్ నవంబర్ 12న జారీ కాగా.. ప్రస్తుతం తొమ్మిది రోజులు ముందుగా నవంబర్ 3న వేశారు. ఇదే తరహాలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన తేదీల్లో కొన్ని రోజుల వ్యత్యాసం ఉంది. కాగా గత ఎన్నికల పోలింగ్ డిసెంబర్ 7న జరగగా.. ప్రస్తుతం నవంబర్ 30న జరగనుంది. అప్పుడు డిసెంబర్ 11న ఓట్ల లెక్కింపు.. ఫలితాలు వెల్లడించారు. ప్రస్తుతం డిసెంబర్ 3న రిజల్ట్ రానుంది.

కేంద్రాలకు ఈవీఎంలు సిబ్బంది..

2018 ఎన్నికల్లో జరిగిన అల్లర్లు, గొడవలకు దృష్టిలో పెట్టుకుని అధికారులు భారీ భద్రతా ఏర్పాటు చేశారు. 12నియోజవర్గాల్లో 960సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. అత్యధికంగా ములుగులో 261, తర్వాత భూపాలపల్లి నియోజకవర్గంలో 112సమస్యాత్మక కేంద్రాలను అధికారులు ప్రకటించారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో మారుమూల అటవీ ప్రాంతాలు, రాష్ట్ర సరిహద్దు మావోయిస్టు ప్రభావిత ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ఉన్నాయి. కాగా ఈ రెండు జిల్లాల్లో గంట ముందు అంటే సాయంత్రం 4గంటలకే పోలింగ్ ముగుస్తుంది. కాగా బుధవారం రాత్రి వరకు ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎలక్ట్రానిక్ యంత్రాలతో పోలింగ్ కేంద్రాలు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ నీడలో పోలింగ్ జరగనుంది. కాగా సమస్యాత్మక కేంద్రాలతో పాటు సాధ్యమైనచోట వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసి, కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. కాగా సమస్యాత్మక కేంద్రాల పరిధిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు తనిఖీలు, కార్డన్‌సెర్చ్‌లు చేపడుతున్నారు. అనుమానితులపై నిఘా పెట్టడంతో పాటు కేంద్ర పారా మిలటరీ బలగాలను రంగంలోకి దింపారు.



పోటీలో వీరు.. గెలిచేదెవరో..

ఉమ్మడి వరంగల్‌లోని 12అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి 36 మంది మధ్యే పోటీ నెలకొంది. భూపాలపల్లి, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో ఈ మూడు పార్టీల మధ్య తీవ్ర పోటీ ఉంది. మిగతాచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే పోటీ నెలకొంది. వరంగల్ పశ్చిమ నుంచి దాస్యం వినయ్‌భాస్కర్ (బీఆర్ఎస్), నాయిని రాజేందర్‌రెడ్డి(కాంగ్రెస్), రావు పద్మ (బీజేపీ), వరంగల్ తూర్పు నుంచి కొండా సురేఖ (కాంగ్రెస్), నన్నపునేని నరేందర్ (బీఆర్ఎస్), ఎర్రబెల్లి ప్రదీప్‌రావు(బీజేపీ), భూపాలపల్లి నుంచి గండ్ర వెంకటరమణారెడ్డి (బీఆర్ఎస్), చందుపట్ల కీర్తిరెడ్డి (బీజేపీ), గండ్ర సత్యనారాయణరావు(కాంగ్రెస్), పాలకుర్తి నుంచి ఎర్రబెల్లి దయాకర్‌రావు (బీఆర్ఎస్), మామిడాల యశస్వినిరెడ్డి (కాంగ్రెస్) పోటీ పడుతున్నారు. పరకాలలో చల్లా ధర్మారెడ్డి (బీఆర్ఎస్), రేవూరి ప్రకాశ్‌రెడ్డి (కాంగ్రెస్), వర్ధన్నపేట(ఎస్సీ)లో అరూరి రమేష్ (బీఆర్ఎస్), కేఆర్ నాగరాజు (కాంగ్రెస్), కొండేటి శ్రీధర్ (బీజేపీ), స్టేషన్‌ఘన్‌పూర్(ఎస్సీ)లో కడియం శ్రీహరి (బీఆర్ఎస్), సింగపురం ఇందిర (కాంగ్రెస్), జి.విజయ రామారావు (బీజేపీ), జనగామలో పల్లా రాజేశ్వర్ రెడ్డి (బీఆర్ఎస్), కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి (కాంగ్రెస్), ఆరుట్ల దశమంతరెడ్డి (బీజేపీ)మధ్య పోటీ ఉంది. మహబూబాబాద్(ఎస్టీ)లో బానోతు శంకర్ నాయక్ (బీఆర్ఎస్), డాక్టర్ మురళీనాయక్ (కాంగ్రెస్), జాటోతు హుస్సేన్‌నాయక్ (బీజేపీ), నర్సంపేటలో పెద్ది సుదర్శన్‌రెడ్డి (బీఆర్ఎస్), దొంతి మాధవరెడ్డి (కాంగ్రెస్), డోర్నకల్‌లో డీఎస్ రెడ్యానాయక్ (బీఆర్ఎస్), రామచంద్రునాయక్ (కాంగ్రెస్), ములుగులో ధనసరి సీతక్క (కాంగ్రెస్), బడే నాగజ్యోతి (బీఆర్ఎస్), అజ్మీరా ప్రహ్లాద్ (బీజేపీ)గెలుపు కోసం పోరాడుతున్నారు.

అన్నం, నీళ్లు లేవు

● జనగామ ఎన్నికల సామగ్రి పంపిణీలో అధికారుల నిర్లక్ష్యం

● ఆందోళనకు దిగిన పీఓ, ఏపీఓ, ఓపీఓలు

● కడుపు మాడ్చుకున్న అధికారులు

● ఆర్వోపై కలెక్టర్ ఆగ్రహం



ఆర్వో వేదిక వద్ద నిరసన తెలుపుతున్న పోలింగ్ సిబ్బంది, అధికారులు

జనగామ: ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన అధికారుల 'కడుపు మండి' ఆందోళనకు దిగిన సంఘటన బుధవారం జిల్లా కేంద్రంలో జరిగింది. సాధారణ ఎన్నికల నేపథ్యంలో నేడు జరగనున్న పోలింగ్‌కు జిల్లా కేంద్రంలోని హనుమకొండ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో జనగామ నియోజకవర్గ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 7గంటల వరకు సుమారు 1,332 మంది పీఓ, ఏపీఓ, ఓపీఓలతోపాటు ఆయా శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది సోషల్ వెల్ఫేర్‌కు చేరుకున్నారు. ఈక్రమంలో పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియలో అధికారుల నిర్లక్ష్యం కనిపించింది. సామగ్రి పంపిణీ చేసే అధికారులతోపాటు ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన వారికి సరిపడా తాగునీరు సైతం అందిచలేని దుస్థితి నెలకొంది. ప్రైవేటుగా షాపుల్లో తాగునీటిని కొనుగోలు చేసుకుని దాహం తీర్చుకున్నారు. మధ్యాహ్నం భోజన సమయంలో సగం మంది అధికారులకు భోజనం వడ్డించగానే.. గిన్నెలు ఖాళీ కావడంతో అధికారులు రిటర్నింగ్ అధికారి వేదిక వద్ద ఆందోళనకు దిగారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే అధికారుల లెక్క ఉన్నప్పటికీ, అందరికీ సరిపడా భోజనం ఎందుకు సిద్ధం చేయలేదని నిలదీశారు. బీపీ, షుగర్ ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఆకలికి తట్టుకోలేని చాలామంది అధికారులు ప్లేట్లలో పెరుగు, పప్పుకూర వేసుకుని తినేయగా, చాలా మంది హోటల్స్ నుంచి తెప్పించుకున్నారు. కొంత మంది భోజనం తయారు చేసే వరకు ఖాళీ ప్లేట్లు పట్టుకుని నిరీక్షించారు. ఎన్నికల సంఘం నిర్వహణ నిధులు పంపించినా, ఇక్కడ మాత్రం అరకొర వసతులు ఏంటని బాహాటంగానే విమర్శించారు. అధికారులకు అవసరమైన వసతి సౌకర్యాలను కల్పించడంలో విఫలమైన ఆర్వో, ఇతర అధికారులపై కలెక్టర్ శివలింగయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

కమాండ్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షణ

● మూడు నియోజకవర్గాల్లో పర్యటించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివలింగయ్య



జనగామ కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ: ఓట్ల పండుగకు వేళయింది.. గురువారం ఉదయం ప్రారంభమయ్యే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సర్వం సిద్ధం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య పర్యవేక్షణలో ఎన్నికల నిర్వహణ సామగ్రి తరలించే కార్యక్రమం పూర్తయింది. జిల్లాలోని జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గ కేంద్రాల పరిధి ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని, తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సంబంధిత అధికారులకు సూచనలు చేసినట్లు చెప్పారు. పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం జనగామ జనరల్ అబ్జర్వర్ పి.రమణ సరస్వతితో కలిసి జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో సర్వేలెన్స్ సిస్టం ద్వారా ఎఫ్ఎస్టీ టీంల పనితీరు, చెక్ పోస్టుల నిర్వహణ తదితర వాటిని పరిశీలించారు. కలెక్టర్ వెంట జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు రోహిత్‌సింగ్, మురళీకృష్ణ, రామ్మూర్తి, ఎన్నికల విభాగం అధికారుల, సిబ్బంది ఉన్నారు.



శామీర్‌పేట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఈఓ అనిల్‌కుమార్

శామీర్‌పేట పోలింగ్ సెంటర్ పరిశీలన

జనగామ రూరల్: జనగామ మండల పరిధి గ్రామాల్లో పోలింగ్ స్టేషన్‌లకు పోలింగ్ సిబ్బంది సామగ్రితో చేరుకున్నారు. శామీర్‌పట పోలింగ్‌స్టేషన్‌ను సీఈఓ అనిల్‌కుమార్ పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఎంసీసీ టీం లీడర్ సంపత్‌కుమార్, ఏఎస్ఐ శ్రీనివాస్ రాజు, జీపీ సెక్రెటరీ ఇఫ్తాకరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్ : ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది, అధికారులు

అప్రమత్తంగా ఉండాలి : రవీష్‌గుప్తా



మాట్లాడుతున్న జనరల్ అబ్జర్వర్ రవీష్‌గుప్తా

స్టేషన్‌ఘన్‌పూర్: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా జరిగేలా పోలింగ్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రవీష్‌గుప్తా అన్నారు. స్థానిక ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం మైక్రో అబ్జర్వర్స్‌తో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పోలింగ్ తీరును క్షుణ్ణంగా పరిశీలించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఓ వాసం రామ్మూర్తి, మైక్రో అబ్జర్వర్స్ తదితరులు పాల్గొన్నారు.